# గిరిజనుల మధ్య కాంగ్రెస్ చిచ్చు

- ఎస్టీలను వర్గీకరిస్తామంటున్న రేవంత్‌రెడ్డి ఓ రాజకీయ బ్రోకర్
- వ్యవసాయానికి మూడు గంటలు కరెంట్ చాలన్నందుకు బుద్ధి చెప్పాలి
- ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం
- బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



గుడికుంట తండాలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి రూరల్, నవంబర్ 3: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్టీ వర్గీకరణ చేపడుతామంటున్న టీ-పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్నాడని బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బ్రోకర్‌గా మారిన రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పాలకుర్తి మండల దుబ్బతండా(ఎస్పీ), గుడికుంట తండా, గోపాలపురం, నారబోయిన గూడెం గ్రామాల్లో ప్రర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లికి గిరిజనులు సంప్రదాయ రీతిలో బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ నీరాజనం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల పల్లెలు, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున కేటాయిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు నిధులు మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. గిరిజన బిడ్డలకు ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించామని, వారి కోరిక మేరకు మరిన్ని తండాలను పంచాయతీలుగా గుర్తించామన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని, వీరికి 10శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో గిరిజన రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపినా అమలు చేయడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని ఎర్రబెల్లి విమర్శించారు. తండాల్లో సాగు, తాగునీరు, కనీస సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. తండాలకు, ఆవాస ప్రాంతాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపానన్నారు. మిషన్ భగీరథ ద్వారా తండాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ గుడికి రూ.10 కోట్లు మంజూరు చేశామని ఆయన గుర్తు చేశారు. ఆసరా పథకంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ అందిస్తున్నామన్నారు. అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్, మతతత్వ బీజేపీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఎర్రబెల్లి ప్రజలకు పిలుపునిచ్చారు.

**నూతన జీపీ భవన నిర్మాణాలకు నిధులు..**

గ్రామపంచాయతీలుగా మారిన తండాల్లో నూతన జీపీ భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. గ్రామాలతోపాటు తండాల్లోనూ నర్సరీలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో గిరిజనులను పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే వారిని పట్టించుకోవద్దని సూచించారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉపాధి హామీ కూలీలకు ఉచితంగా బ్యాగులను అందిస్తున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు గిరిజనులు అండగా నిలబడాలని ఆయన కోరారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలంటున్న కాంగ్రెస్ నేతలకు గుణపాఠం చెప్పాలని, నిరంతర విద్యుత్ ఇస్తున్న బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని దయాకర్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ వీరమనేని యాకాంతారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎర్రబెల్లి రాఘవరావు, ముస్కు రాంబాబు, యూత్ ఇన్‌చార్జి ఎర్రబెల్లి వినయ్‌రావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, సర్పంచ్‌లు బానోత్ యాకూబ్, కాంతి, మేడిద రజిత, చెరిపెల్లి రజిత అనిల్, కోస రాంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు రమేశ్, భోజ్యా, మూర్తి, గంగమ్మ, బానోత్ శంకర్, ఠాకూర్, దేవేందర్, హనుమంతు, వీరన్న, మోహన్, జైతురాం, బానోత్ వెంకటి, రాములు, రమేశ్, సమ్మయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

# మీరే నా బలం..బలగం

- ఆదరించండి.. మీ పెద్దన్నలా సేవ చేసి రుణం తీర్చుకుంటా..
- వలస పార్టీల వలలో పడితే అభివృద్ధిలో వందేళ్లు వెనక్కిపోతాం..
- విజ్ఞతతో ఆలోచించి, పనిచేసేటోళ్లకు పట్టంకట్టండి..
- కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు కొనితెచ్చుకోవడమే..
- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



ఇంటింటి ప్రచారంలో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నెల్లికుదురు, నవంబర్ 3 : ప్రజాసేవ చేయాలనే తపనతో పెద్ద కొలువును వదులుకొని వచ్చా.. మీరే నా బలం.. బలగమనుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా.. మూడోసారి ఆదరించండి.. మీ పెద్దన్నలా సేవచేసి రుణం తీర్చుకుంటా'నని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. 'ఇంటి ముందు అభ్యర్థి – కండ్లెదుట అభివృద్ధి' అనే నినాదంతో శుక్రవారం మండలంలోని బంజర, శ్రీరామగిరి, మధనతుర్తి, రావిరాల, వస్రాంతండా, దుర్గాభవాని తండా గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టగా, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం పల్లెలు ఎట్లున్నయ్.. ఇప్పడెట్లున్నయో ప్రజలు ఆలోచించాలన్నారు. గత 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు తెలంగాణ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. చావునోట్లో తలపెట్టి అలుపెరగని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. రూ.200 పింఛన్ కోసం చెప్పులరిగేలా తిరిగే పరిస్థితి అప్పుడుంటే, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వెంటనే రూ.3016 పింఛన్ వస్తున్నదన్నారు. సాగు సీజన్‌కు ముందే రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వమే పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ. 10 వేలు అందిస్తున్నదని, మళ్లీ బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే ఎకరానికి రూ.16వేల అందిస్తామన్నారు. మెడికల్, ఇంజినీరింగ్, ఉద్యాన కళాశాలలతో మానుకోటను ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. త్వరలో మానుకోటను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్ది, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎన్నికలప్పుడే వచ్చే వలస పార్టీలను నమ్మితే అభివృద్ధిలో తెలంగాణ వందేళ్ల వెనక్కిపోతుందన్నారు. 24 గంటల నాణ్యమైన కరెంట్, పంట సాయం, రైతుబీమా, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, వ్యవసాయ గోదాముల నిర్మాణంతో సీఎం కేసీఆర్ రైతులకు అండగా ఉన్నాడని అన్నారు. అన్నంపెట్టే అన్నదాతలను కేసీఆర్ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుంటే కాంగ్రెస్ మాత్రం 3 గంటల కరెంట్ చాలని దర్మార్గపు మాటలు మాట్లాడుతున్నదన్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆగమైపోతామన్నారు. నెల్లికుదురు మండలంలోని అన్ని తండాల్లో సకల సౌకర్యాలు కల్పించానన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నన్ను ఆశీర్వదించండి.. మీ పాలేరుగా, మీ పెద్దన్నలా సేవచేసి మీ రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ భూక్యా బాలాజీనాయక్, మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, సొసైటీ చైర్మన్లు గుండా వెంకన్న, కాసం లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కే విజయ్‌యాదవ్, గుగులోత్ బిక్కూనాయక్, మీడియా మండల ఇన్‌చార్జి ఎడ్ల మహేశ్, మదనతుర్తి సర్పంచ్ కొమ్ము అనిల్, ప్రవీణ్, చంద్రారెడ్డి, పులి రామచంద్రు, పీ గణేశ్, ఎం ప్రశాంత్, పుల్లయ్య, మంద అశోక్, బొల్లు మురళి, అశ్విన్, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

# బీజేపీది కపట నాటకం

- బీసీలను మోసం చేసేందుకు కుట్రలు
- ముఖ్యమంత్రి ఎవరో ముందే ప్రకటించాలి
- భ్రమల నుంచి ఈటల బయటికి రావాలి
- బీజేపీ గిరిజనులను మోసం చేసింది: మంత్రి సత్యవతి

గూడూరు, నవంబర్ 3 : బీసీలను మోసం చేసేందుకు బీజేపీ కపట నాటకాలు ఆడుతున్నదని మంత్రి సత్యవతిరాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడూరు మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితతో కలిసి ఆమె మాట్లాడారు. బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ బీఆర్‌ఎస్‌పై అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. ఆరోపణలు చేసే ముందు అతను బీజేపీ భ్రమలో నుంచి బయటికి రావాలని హితవు పలికారు. ఈటల రాజేందర్‌కు సీఎం కేసీఆర్ పార్టీలో అధిక ప్రాధాన్యం ఇచ్చి, రాజకీయ భిక్షపెట్టి ఎమ్మెల్యేగా గెలిపించడంతోపాటు ఆర్థిక మంత్రిగా, ఆరోగ్య శాఖ మంత్రిని చేసి కుడిభుజంలా చూసుకున్నారని అన్నారు. కానీ, ఈటల పార్టీకి ద్రోహం చేసే పనులు చేశాడని, పేద దళితుల భూములను ఆక్రమించినందుకు కేసీఆర్ ప్రశ్నిస్తే విధిలేని పరిస్థితిలో పార్టీ మారాడని చెప్పారు. బీసీని ముఖ్యమంత్రి చేస్తామని బీజేపీ నాటకాలాడుతున్నదని, బీసీగా ఉన్న బండి సంజయ్‌ని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి మార్చి, ఉన్నత వర్గానికి చెందిన కిషన్‌రెడ్డికి ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోని బీజేపీ బీసీలకు బడ్జెట్ కేటాయించకుండా, మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాన్ని నడపడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. బీజేపీ గిరిజనులను మోసం చేస్తున్నదన్నారు. గిరిజన యూనివర్సిటీని పదేళ్లు నాన్చిందని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటును పట్టించుకోవడం లేదన్నారు. ఇవన్నీ తెలుసుకోకుండా ఈటల మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రంలో బీజేపీకి సింగిల్ డిజిటేనని, చాలా చోట్ల డిపాజిట్ రాదన్నారు. మానుకోటలో ఎగిరేది గులాబీ జెండాయేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మహబూబాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. ఒక్క గూడూరు మండలంలో దాదాపు 16వేల మందికి పోడు పట్టాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు కాసీం, మండల అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రంగారావు, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, పరకాల శ్రీనివాస్‌రెడ్డి, జలగం సంపత్‌రావు, ముక్కా లక్ష్మణ్‌రావు, పాష, సురేందర్, నర్సింహా, కోడి రవి, శివ, ఎల్లయ్య పాల్గొన్నారు.



పాలకుర్తిలో మంత్రి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పోచంపల్లి వార్డు సభ్యులు, కాంగ్రెస్ యూత్ నాయకులు

# కొనసాగుతున్న వలసలు

**పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి దయాకర్‌రావు**

తొర్రూరు/పెద్దవంగర, నవంబర్ 3: పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. తొర్రూరు మండలం ఫత్తేపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 10 మంది, ఎస్‌కే జానిమియా ఆధ్వర్యంలో, పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు కనుకుంట్ల నరేశ్, యూత్ నాయకులు రాంపెల్లి హరీశ్, సుదగాని అశోక్‌చ సుదగాని శ్రీకాంత్ బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి మంత్రి ఎర్రబెల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమేశ్వర్‌రావు, సుధీర్‌కుమార్, మనోహర్‌గౌడ్, రామ్మూర్తిగౌడ్, వెంకన్న, వరప్రసాద్‌రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.